INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

# మంగిపూడి వేంకట శర్మగారి పృథ్వీరాజు-తారాబాయి (నాటకం) – ఒక పరిశీలన

డా.వి.కన్నం నాయుడు,లెక్చరర్,మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల,విజయనగరం

**కవి పరిచయం:-**

శర్మగారు ఆధునిక యుగంలో కందుకూరి, చిలకమర్తి తర్వాత 3వ తరానికి చెందిన కవి. పశ్చిమ గోదావరి జిల్లా పిప్పర గ్రామంలో 1882 జనవరి 9న జన్మించారు. వీరు పెద్దగా చదువుకోకపోయినప్పటికీ పోతనలాగా సహజ పాండిత్యం కలిగినవారు. బాల్యం నుంచే కావ్యరచన ప్రారంభించి ఆధునిక యుగంలోని అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేశారు. వీరు సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ సంస్కరణ దృక్పథం కలిగినవారు. హరిజనోద్ధరణ, స్త్రీ జనోద్ధరణ కాంక్షిస్తూ వారు అనేక రచనలు చేశారు. తెలుగు సాహిత్యంలో హరిజనోద్ధరణను కాంక్షిస్తూ రచనలు చేసిన వారిలో వీరు ప్రథములు. గాంధీజీ హరిజనోద్ధరణకు పూనుకోకముందే అస్పృశ్యతను నిరసిస్తూ "నిరుద్ధ భారతం" రాశారు. అస్పృశ్యత వల్ల భారతదేశ అభివృద్ధి నిరోధించబడిందని ఇందులో చెప్పారు. ఆనాడు స్త్రీల దయనీయ స్థితిని చూసి, వారి అభ్యున్నతిని కాంక్షిస్తూ "స్త్రీ ధర్మబోధిని, స్త్రీ నీతి కథామంజరి, బాల వితంతు విలాపం" మొ.న రచనలు చేశారు. సంఘ సంస్కరణ బాధ్యతను గుర్తించిన అద్భుతకవి శర్మగారు.

జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం ముమ్మరంగా జరుగుతున్నపుడు వాటిని ప్రబోధిస్తూ శర్మగారు అనేక గ్రంథాలు రాసారు. అంతే కాకుండా పత్రికల్లో వీటికి సంబంధించిన కవితా ఖండికలు, గేయాలు, వ్యాసాలు తరచుగా రాసి ఆంధ్రదేశంలో గొప్ప కవిగా ప్రసిద్ధి పొందారు. జాతీయోద్యమాన్ని ప్రబోధిస్తూ వీరు రాసిన "మేలుకొనుమీ భరతపుత్రుడ" అనే గేయం, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోరుతూ చేస్తున్న ఆంధ్రోద్యమంలో నాయకుల మధ్య ఏర్పడిన ప్రాంతీయ భేదాలను ఖండిస్తూ వీరు రాసిన "జో ఆంధ్రపుత్రుడా! జో మహాఘనుడా! జో అసమర్థుడా! జో దంభ పరుడా!" అనే సుదీర్ఘమైన జోలపాట చాలా ప్రసిద్ధమైనవి.

మంగిపూడి వేంకటశర్మగారు రుక్మిణీపరిణయం, పృథ్వీరాజు-తారాబాయి, వీరమతి, సహకార విజయం, ధనాభిరామ, పుష్పవేణి అనే 6 నాటకాలు రాశారు. వీటిలో మొదటి నాలుగూ లభిస్తున్నాయి, చివరి రెండూ లభించలేదు. లభిస్తున్న నాలుగు నాటకాలూ చాలా వైవిధ్యభరితమైన ఇతివృత్తాలు కలిగినవి.

**పృథ్వీరాజు-తారాబాయి :-**

ఇది రాజపుత్రులకు చెందిన చారిత్రక నాటకం. టంగుటూరి శ్రీరాములు గారు ఆంగ్లంలో రాసిన దీన్ని మంగిపూడి వారు సత్యవోలు గున్నేశ్వరరావు గారి కోసం అనువదించారు. గున్నేశ్వరరావు గారు రాజమండ్రిలో చింతామణి నాటకసమాజం స్థాపించి నాటకాలు ప్రదర్శించేవారు. వీరే ఈ నాటకాన్ని 1931 లో చింతామణి ముద్రాక్షరశాలలో ముద్రించి సర్వ హక్కులు తీసుకున్నారు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

రాజస్థాన్ లో మేవారు, మార్వారు, బికనీరు, జైసల్మీరు మొదలైన అనేక రాజ్యాలు ఉండేవి. వీటిలో మేవారు ప్రసిద్ధమైంది. దీన్నే మేవాడ అని కూడా అంటారు. ఈ రాజ్యాన్ని పరిపాలించే రాజును రాణా అని అంటారు. దీనికి రాజధాని చిత్తోడ్ ఘడ్. ఈ రాజులు శిశోదియా వంశానికి చెందినవారు. అక్బర్ కు లొంగకుండా పోరాడి స్వాతంత్ర్యాన్ని నిలుపుకున్న రాణా ప్రతాపసింహుడు ఈ వంశానికి చెందినవాడే. మొగలు సామ్రాజ్యాన్ని స్థాపించిన బాబరుకు గుండె దడ పుట్టించి సమకాలపు శూర మండలంలో గండరగండడుగా ప్రసిద్ధి చెందిన రాణా సంగ్రామసింహుడు కూడా ఈ శిశోడియా వంశానికి చెందినవాడే.

"పృథ్వీరాజు-తారాబాయి" నాటకంలో నాయకుడైన పృథ్వీరాజు మేవాడను పాలించిన శిశోదియా రాజవంశానికి చెందినవాడు. ఇతడు రాణా సంగ్రామసింహునికి స్వయానా తమ్ముడు. వీరి తండ్రి రాణా రాయమల్లుడు. రాణా సంగ్రామసింహునికి ఉన్న మరొక పేరు రాణా సంగ. రాయమల్లునికి సంగ, పృథ్వీ, జయమల్ అనే ముగ్గురు కుమారులు. ఆనాడు రాజపుత్రులలో సింహాసనం కోసం అన్నదమ్ముల మధ్య పోరాటం సాధారణంగా జరుగుతుండేది. ఈ నాటకంలోని ఇతివృత్తం రాజ్యంకోసం జరిగే పోరాటమే.

స్కాట్లాండ్ దేశానికి చెందిన కల్నల్ జేమ్స్ టాడ్ అనే ఆంగ్ల చరిత్రకారుడు ఇంగ్లీషులో "Annals And Antiquities of Rajasthan " అనే గ్రంథం రాశాడు. ఇందులో "Annals of Mewar, Annals of Marwar, Annals of Bikanir" అనే పేర్లతో వేరు వేరు చరిత్రలు ఉన్నాయి. చిలకమర్తి వారు టాడ్ గ్రంథం నుంచి కొన్ని ప్రసిద్ధ వ్యక్తుల చరిత్రలు తీసుకుని తెలుగులో "రాజస్థాన కథావళి" పేరుతో ఒక గ్రంథాన్ని రాశారు. ఇందులో మొదటి భాగంలో ఆరవ చరిత్రగా "పృథివి రాజు సాహసములు" అనే పేరుతో పృథ్వీరాజు, తారాబాయిల చరిత్ర ఉంది.

"పృథ్వీరాజు-తారాబాయి" నాటకంలో నాయకుడు పృథ్వీరాజు. ఇతడు ధీరోద్ధతుడు. చెప్పలేనంత తెగింపు, సాహసం, పరాక్రమం కలిగినవాడు. మనస్సులోని భావాన్ని దాచుకోకుండా జంకు, గొంకు లేకుండా బయటకు చెప్పడం, చెప్పి, దాన్ని చెప్పినట్లుగా ఆచరించడం ఇతని నైజం. ఇతడు మేవారును పాలించిన రాణా రాయమల్లుకు రెండవ కుమారుడు. ఇతని అన్న సంగుడు. తమ్ముడు జయమల్లు. తండ్రి తరువాత మేవారు రాజ్య సింహాసనాన్ని అధిష్టించాలనేది ఇతని బలమైన కోరిక. దీనికి అడ్డుగా ఉన్నవాడు పెద్దవాడైన సంగుడు. అతన్ని చంపితే గానీ తాను మేవారు సింహాసనాన్ని అధిష్టించలేనని తెలుసుకుని పృథ్వీరాజు సంగుని చంపడానికి ప్రయత్నిస్తాడు. సంగునికి పృథ్వీరాజు అంటే సింహస్వప్నం. తమ్మునికి భయపడి ఇతడు మేవారును వదిలి పెట్టి ఇతర రాజ్యాలలో తలదాచుకుంటాడు. పృథ్వీరాజు అర్థాంతరంగా చనిపోవటం వలన సంగుడు తన తండ్రి తరువాత మేవారుకు రాణా కాగలిగాడు. పృథ్వీరాజు జీవించి ఉంటే సంగుడు రాణా అయ్యేవాడే కాదు. తరువాత కాలంలో ఈ సంగుడే రాణా సంగ్రామసింహుడుగా, గొప్ప యుద్ధ వీరుడిగా ప్రసిద్ధి కెక్కాడు. అలాంటి వీరుని గడగడ లాడించిన సింహ పరాక్రముడు పృథ్వీరాజు. ఇతని భార్య తారాబాయి. వీరిద్దరికీ సంబంధించిన ఇతివృత్తమే ఈ నాటకంలోని కథ. ఇది చాలా వరకూ టాడ్ రాసిన "Annals And Antiquities of Rajasthan" అనే గ్రంథం లోని "Annals of Mewar" అనే విభాగంలో చెప్పబడిన పృథ్వీరాజు, తారాబాయిల చరిత్రను అనుసరించి చెప్పబడింది. అభూత కల్పనలూ, అమానుషమైన సంఘటనలూ ఏమీ ఇందులో లేవు. కథ పూర్తిగా చరిత్రను అనుసరించి ఉంది.

చరిత్ర ప్రకారం పృథ్వీరాజు తన చెల్లెలు భర్త జయమాలుని విషప్రయోగం వలన మరణిస్తాడు.ఈ నాటకంలో కూడా అలాగే ఉంది.నాయక మరణంతో నాటకం అంతమవ్వడం వలన ఇది విషాదాంత నాటకం. ఇది పూర్తిగా చరిత్రకు అనుగుణంగా ఉంది. చరిత్రను వక్రీకరించలేదు. నూటికి నూరుపాళ్లు చరిత్రననుసరించి రాసిన నాటకాలు తెలుగులో అరుదు.

చరిత్ర విషయ ప్రధానమైంది. చరిత్రలోని కథను ఉన్నది ఉన్నట్లుగా సాహిత్యంగా రాస్తే అది ఆసక్తికరంగా ఉండదు. చరిత్రకారులకు మాత్రం ఆసక్తికరంగా ఉండవచ్చును.చరిత్రలో జరిగిపోయిన సంఘటనలు యథాతథంగా,కాలానుగుణంగా చెప్పాలి. కల్పనకు చోటుండదు. కానీ సాహిత్యంలో కల్పన ముఖ్యం. కల్పన కలిగించే హృదయ రంజకత్వాన్ని బట్టి ఆ సాహిత్య ప్రక్రియ ప్రసిద్ధిని పొందుతుంది. చారిత్రక నాటకంలో కల్పనలు హేతుబద్ధమైనవిగా,చరిత్రకు భంగం కలిగించనవిగా ఉండాలి. "పృథ్వీరాజు-తారాబాయి" నాటకంలో కల్పనలు హేతుబద్ధమైనవిగా ఉన్నాయి. అంతే కాకుండా సాహిత్యాంశాలైన సన్నివేశ నిర్వహణ, పాత్రచిత్రణ, రసపోషణ,చక్కటి సంభాషణలు ఉండడం వలన ఆసక్తికరంగా సాగుతుంది.

**నాటకంలో అంకాలు-రంగాలు:-**

ఈ నాటకంలో నాంది,ప్రస్తావన,భారతవాక్యం మొదలైన ప్రాచీన నాటక లక్షణాలు లేవు. ఇంగ్లీషు నుంచి అనువాదం పొందినది,ఆధునికం కావడం వలన ఇవేవీ లేకుండానే మంగిపూడి వారు రాశారు. ఇది ప్రథమాంకంతో ప్రారంభమౌతుంది. మొత్తం 5 అంకాలున్నాయి. ప్రతి అంకాన్ని రంగాలుగా విభజించారు. ప్రథమాంకంలో 6,ద్వితీయాంకంలో 5,తృతీయాంకంలో 5,చతుర్థాంకంలో 5,పంచమాంకంలో 4 మొత్తం 25 రంగాలున్నాయి. రంగాలు కొన్ని చిన్నవిగా,మరికొన్ని సగం పేజీ లో మాత్రమే ఉన్నవి కూడా ఉన్నాయి.

**కవి గారి మనోగతం:-**

ఈ నాటక అనువాదాన్ని గురించి మంగిపూడి వారు పీఠికలో "ఇందు మాతృకననుసరించియే చాలావరకు వ్రాయబడింది. కాని యక్కడక్కడ కొన్ని పద్యములలోని యభిప్రాయములును,తారాబాయి పృథ్వీరాజుల సంభాషణము పట్టునను నించుక స్వతంత్రించి మార్పు చేయబడినది. ఈ నాటకము ప్రదర్శనానుకూలమై వీరరసభరితమై జనరంజక మగునటుల శ్రీ శ్రీరాములుగారిచే రచియింపబడినను నాంగ్లేయ భాషానభిజ్ఞుడ కతిపయ మిత్ర సాహాయ్యుండ మాత్రముననే తెనిగించుటచే మూలమునందలి రసము చెడకను భాషాంతరీకరింప గలిగితినను నిశ్చయము నాకు లేదు. దీనిని నేను శ్రీయుతులగు గున్నేశ్వరరావు సోదరుల కోరికపై నాంధ్రీకరించి ఈ పుస్తకము యొక్క స్వామ్యమును వారికే ఇచ్చి వేసితిని."అని చెప్పుకున్నారు. దీన్నిబట్టి మంగిపూడి వారు టంగుటూరి శ్రీరాములు గారు ఆంగ్లంలో రాసిన దాన్ని చాలావరకు ఉన్నది ఉన్నట్లుగా తెలుగులోకి అనువదించారని చెప్పవచ్చు.

"పృథ్వీరాజు-తారాబాయి" నాటకంలో నాటకకర్త చారిత్రకాంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని దాన్ని నాటకంగా ఎలా తీర్చిదిద్దారో పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశ్యము.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

**ప్రథమాంకం:-**

నాటకంలోని ప్రథమాంకంలో 6 రంగాలున్నాయి.ప్రథమరంగం పూర్తిగా కవికల్పితం.ఇందులో రాణా రాయమల్లుడు రాజపుత్రుల్లో అన్నదమ్ములు రాజ్యకాంక్షతో యుద్ధాలు చేసుకుంటూ రాజపుత్ర వంశానికి కళంకం తెస్తున్నారని తన తండ్రి తనను దేశం నుంచి వెళ్ళగొట్టడం,ఆ సమయంలో తన తమ్ముడు తన తండ్రిని చంపి రాజ్యానికి రావడం,తాను తన తమ్ముణ్ణి అతని కుమారులను ఓడించి మేవారు సింహాసనాన్ని అధిష్టించడం మొదలైన విషయాలను తన మంత్రికి వివరిస్తాడు. ఇందులో రాయమల్లుని తండ్రి పేరు లేదు. అతడు రాయమల్లుని దేశం నుంచి ఎందుకు బహిష్కరించాడో చెప్పలేదు. కానీ ఈ విషయాలు చిలకమర్తి వారి "రాజస్థాన కథావళి" 5వ ప్రకరణం రాణా కుంభుని చరిత్రలో ఉన్నాయి. రాణా కుంభుడు రాయమల్లుని తండ్రి. ఇతడు కొలువుకూటానికి వచ్చేటప్పుడు చేతిలో కత్తి పట్టుకుని తనలో తాను ఏదో గొణుగుకుంటూ సింహాసనం మీద కూర్చునేవాడంట.అతనికి ఇది ఒక అలవాటుగా ఉండేది. పెద్ద కుమారుడైన రాయమల్లునికి సందేహం కలిగి కారణం అడుగుతాడు. దానికి కుంభుడు కోపించి అతన్ని దేశం నుంచి బహిష్కరిస్తాడు. తండ్రి ఆజ్ఞ ననుసరించి రాయమల్లుడు వేరే చోట తలదాచుకుంటాడు.అప్పుడు కుంభుని చిన్నకొడుకుల్లో ఒకడు చారునికి లంచమిచ్చి తండ్రిని చంపించి సింహాసనం అధిష్టించి 5 ఏళ్ళు పరిపాలిస్తాడు.ఈలోగా రాయమల్లుడు సైన్యం సమకూర్చుకుని తమ్ముని మీదకు దండెత్తి వచ్చి అతన్ని వెళ్లగొట్టి మేవారు సింహాసనాన్ని కైవశం చేసుకుంటాడు. ఓడిపోయిన పితృహంతకుడు పారిపోయి ఢిల్లీ చక్రవర్తిని ఆశ్రయించి అతని సాయంతో మేవారు సింహాసనాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నం ఫలించక ముందే పిడుగుపాటు వలన అతడు చనిపోతాడు. "రాజస్థాన కథావళి"లో ఈ పితృద్రోహి పేరు ప్రస్తావించలేదు,కానీ ప్రజలు అతన్ని "హంత"అని పిలిచేవారని చిలకమర్తి వారు రాశారు. ఈ విషయాలను ఆధారంగా చేసుకునే నాటకంలో ప్రథమాంకంలో ప్రథమరంగం కల్పించబడింది.

**2వ రంగంలో** సంగుడు,పృథ్వీరాజు,జయమల్లుడు,సురాజమల్లు సమకాలపు రాజకీయ పరిస్థితులను చర్చించుకుంటున్నప్పుడు,పృథ్వీరాజు తమ తండ్రి రాయమల్లుని తరువాత తానే మేవారు సింహాసనాన్ని అధిష్టిస్తానని నిశ్చయంగా చెప్పడం,అందుకు రాయమల్లుని జ్యేష్ఠకుమారుడైన సంగుడు భవిష్యత్తులో ఎవరు రాజు అవుతారో తెలుసుకోవడానికి వ్యాఘ్ర పర్వతం మీద ఉన్న అర్చకురాలు దగ్గరకు వెళ్లి కనుక్కుందామని చెప్పడం జరిగింది.ఇందులో ఇంగ్లీషు,తెలుగులో ఒకే విధంగా చరిత్రలో ఉన్నది ఉన్నట్లుగానే రాశారు.అదేవిధంగా **3వ రంగంలో** పై నలుగురు వ్యాఘ్ర పర్వతం మీద ఉన్న చారణాదేవి దగ్గరకు వెళ్లి రాయమల్లుని తరువాత మేవారు సింహాసనాన్ని ఎవరు అధిష్టిస్తారో జోష్యం చెప్పమని కోరడం,అర్చకురాలు వ్యాఘ్ర చర్మం మీద కూర్చుని ఉన్న సంగుడు రాజవుతాడని చెప్పడం,వెంటనే పృథ్వీరాజు కోపగించి సంగుని చంపడానికి ప్రయత్నించడం,సురాజమల్లు పృథ్వీరాజుని అడ్డగించడం,పృథ్వీరాజు సురాజమల్లుని మీదికి కత్తితో దాడిచేయడం,వారిద్దరు కత్తియుద్ధం చేసి మూర్ఛిల్లిపోవడం,జయమల్లుడు పారిపోయిన సంగుని చంపడానికి తన అనుచరులతో వెళ్లడం మొదలైన ఇతివృత్తమంతా చరిత్రలో ఉన్నదే.

**4వ రంగంలో** రాయమల్లుడు తన కుమారులు,తమ్ముడు సురాజమల్లు వ్యాఘ్రపర్వతం మీద యుద్ధం చేసిన విషయం తన మంత్రికి చెప్పి తాను ఏది జరగకూడదని కోరుకున్నాడో అదే జరిగినందుకు ఎంతగానో విచారిస్తాడు.ఇది నాటకకర్త కల్పించింది.రాజ్యం కోసం కుమారుల మధ్య అంతః కలహాలు సంభవించి తన ప్రియ కుమారుడైన సంగుడు భయపడి రాజ్యం నుంచి వెళ్లిపోవడం, అతన్ని చంపడానికి జయమల్లుడు వెదుక్కుంటూ వెళ్లడం,పృథ్వీరాజు,సురాజమల్లుడు తీవ్రమైన గాయాలతో మంచం పట్టడం,తెలుసుకున్న తరువాత ఏ తండ్రికైనా దిగులు,విచారం కలుగుతుంది.జరిగిన పరిణామాలకు రాయమల్లుడు తీవ్రంగా కలత చెందినట్లుగా ఈ 4వ రంగంలో రాయడం సముచితంగా ఉంది. ఇలా కల్పించడం వలన చరిత్రకు ఎలాంటి విఘాతమూ కలగబోదు.

**5వ రంగంలో** పృథ్వీరాజు గాయాలతో పండుకుని ఉన్నప్పుడు రాయమల్లుడు వచ్చి సంగుని చంపడానికి ప్రయత్నించినందుకు అతన్ని మేవారు నుంచి వెళ్లిపొమ్మని ఆజ్ఞాపిస్తాడు. ఇది చరిత్రలో ఉన్నదే. 6వ రంగంలో పృథ్వీరాజు,అతని అనుచరులు రాయమల్లుని ఆజ్ఞననుసరించి మేవాడ దేశాన్ని వదిలిపెట్టి గోడారు రాజ్యానికి వెళతారు. గోడారు మొదట రాజపుత్రుల అధీనంలో ఉండేదని,ఇప్పుడు మీనుల అధీనంలో ఉన్నదని తెలుసుకుని పృథ్వీరాజు దాన్ని ఎలాగయినా స్వాధీనం చేసుకుని తన తండ్రి రాజ్యంలో కలపాలని తన అనుచరులకు చెబుతాడు. ఈ విషయమంతా చరిత్రలో ఉన్నదే.

**ద్వితీయాంకం:-**

ద్వితీయాంకం **1వ రంగంలో** పృథ్వీరాజు తన ఉంగరాన్ని కుదువ పెట్టి దానం తీసుకుని వస్తానని తన అనుచరులకు చెబుతాడు.**2వ రంగంలో** పృథ్వీరాజు ఓజుడు అనే వర్తకుని కలుసుకుని తన ఉంగరాన్ని కుదువ పెట్టడానికి ప్రయత్నించడం, ఓజుడు పృథ్వీరాజుని గుర్తించి అతని ఉంగరం తీసుకోకుండా అవసరమైన ధనం అతనికివ్వడం,పృథ్వీరాజు గోడారు పట్టణం స్వాధీనం చేసుకునే విషయంలో ఓజుని సహాయం కోరడం,**3వ రంగంలో** ఓజుడు దానికి ఒక ప్రణాళిక చెప్పడం మొదలైన విషయం చరిత్రలో ఉన్నదే. గోడారు రాజు తన రక్షక భటులకు ఒక నిర్ణీత రోజును సెలవు ఇస్తూ ఉంటాడు. ఆ రోజు దగ్గర్లోనే ఉందని,అప్పుడు పృథ్వీరాజు తన అనుచరులతో కోటలోకి ప్రవేశించి రాజును సులభంగా చంపవచ్చునని వివరిస్తాడు. **4వ రంగంలో** పృథ్వీరాజు మీనరాజును చంపి గోడారును స్వాధీనం చేసుకున్న తరువాత ఓజుని తన తండ్రికి సామంతునిగా పాలించమని చెబుతాడు.ఏనాటికైనా మేవారును పాలించాలన్నది తన లక్ష్యమని,అందుకని ఇతర రాజ్యాలను జయించి ఆ పాలకులను తన తండ్రికి సామంతులుగా చేసి తండ్రి అనుగ్రహం పొందాలని ఓజునికి చెబుతాడు.

**5వ రంగంలో** తారాబాయి తండ్రి ఒక తురక రాజు వలన తన తోడా రాజ్యం కోల్పోయి బెడ్నూరులో ఉన్నాడని, తన తండ్రి రాజ్యం తిరిగి సంపాదించి పెట్టిన వీరుని తాను పెళ్లి చేసుకుంటానని తారాబాయి ప్రతిన పట్టడం,పృథ్వీరాజు తమ్ముడు జయమల్లుడు ఆమె కోరిక నెరవేరుస్తానని చెప్పి మాటతప్పి ఆమె పట్ల అవమానకరంగా ప్రవర్తించి,ఆమె చేతిలో చనిపోవడం మొదలైన విషయమంతా చరిత్రలో ఉన్నదే. అంతః పురాల్లో అసూర్యంపశ్యలుగా ఉండే రాజపుత్ర స్త్రీలు మగవారితో సమానంగా యుద్ధవిద్యలు నేర్చుకుని సాహసపరాక్రమాలు

కలిగి ఉండడం అరుదు. అటువంటి అరుదైన యువతి తారాబాయి.పృథ్విరాజు ఆమె తనకు తగిన భార్య అని భావించి ఆమెను వివాహం చేసుకోవడానికి బెడ్నూరుకు బయలుదేరుతాడు.

**తృతీయాంకం:-**

తృతీయాంకం **1వ రంగంలో** పృథ్విరాజు తన అనుచరులతో కలసి బెడ్నూరులో ఉన్న సూరధానుని కలుసుకుని అతని కుమార్తెను వివాహం చేసుకోవాలన్న కోరికను తెలియజేస్తాడు. ఆమె వివాహ విషయంలో తన పాత్ర ఏమీలేదని ఆమెతో మాట్లాడమని సూరధానుడు చెబుతాడు. **2వ రంగంలో** పృథ్విరాజును తారాబాయికి పరిచయం చేసి సూరధానుడు వాళ్ళను ఏకాంతంగా వదలి వెళ్ళిపోతాడు. ఇద్దరూ మొదటి చూపులోనే ఆకర్షింపబడతారు. తోడా రాజ్యం జయించి ఆమె తండ్రికిస్తానని మాట ఇస్తాడు.అతని సాహసాల మీద నమ్మకంతో సూరధానుడు వివాహం జరిపించినట్లు చరిత్రలో ఉంది.

**3వ రంగంలో** పృథ్విరాజు,తారాబాయి ఇద్దరూ కలిసి తోడా రాజ్యం ఎలా జయించాలని మాట్లాడుకుంటారు.మొహరం పండుగ రోజు ముసల్మానుల వేషంలో వెళ్ళి, రాజు విల్లాను చంపాలని తారాబాయి చెబుతుంది. దీనికి పృథ్విరాజు అంగీకరిస్తాడు. ఈ సందర్భంలో బ్రాహ్మణులు నిర్ణయించే ముహూర్తాల పట్ల వ్యతిరేకతను తారాబాయి వ్యక్తం చేస్తుంది. మంగిపూడివారు తన అభిప్రాయాలను తారాబాయి పాత్ర ద్వారా తెలియజేసారు.

**4వ రంగంలో** పృథ్విరాజు,తారాబాయి మహమ్మదీయుల వేషంలో మొహరం పండుగ నాడు తోడా రాజ్యానికి వెళ్ళి,బాణ ప్రయోగం చేసి తోడా రాజును చంపి కోటనుంచి వెలుపలికి వస్తున్నప్పుడు ఒక మదపుటేనుగు వారిని అడ్డుకోవడం,తారాబాయి దాని తొండాన్ని కత్తితో నరకడం,ఆ తరువాత తమ సైనికులతో కలసి పృథ్విరాజు,తారాబాయి ముసల్మానులను ఓడించి తోడా రాజ్యాన్ని వశం చేసుకోవడం మొదలైన విషయమంతా చరిత్రననుసరించి ఉంది.

**5వ రంగంలో** సూరధానుడు తన రాజ్యం తనకు తిరిగి సాధించి పెట్టినందుకు పృథ్విరాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తాడు.అదే సమయంలో తండ్రి రాయమల్లుడు పృథ్విరాజు సాహసాలకు మెచ్చి అతన్ని మేవారు రాజ్యానికి ఆహ్వానిస్తున్నట్లు ఒక లేఖను పంపిస్తాడు.పృథ్విరాజు సమ్మతించి చిత్తోడ్ ఘడ్ కోటలో ఉన్న తండ్రిని దర్శించి,తారాబాయితో కలసి కమల్ మీర్ కోటలో ఉంటానని చెబుతాడు.ఇదంతా చరిత్రలో ఉన్నదే.

**చతుర్థాంకం:-**

చతుర్థాంకం **1వ రంగంలో** రాయమల్లుని తమ్ముడైన సురాజమల్లుడు సారంగదేవుడనే సామంతరాజుతో కలసి రాయమల్లుని మేవారు సింహాసనం నుంచి దింపివేసి తాను సింహాసనం అధిష్టించాలని ప్రణాళిక వేసుకుంటాడు.**2వ రంగంలో** వీరిద్దరూ కలసి రాయమల్లుని మీదికి దండెత్తి రావడం ఉంది. **3వ రంగంలో** పృథ్విరాజు తారాబాయితో కలసి కమల్ మీర్ కోటలోఉన్నప్పుడు రాయమల్లుని దగ్గర నుంచి ఒక సేవకుడు వచ్చి

సారంగదేవుడు చిత్తోడ్ ఘడ్ కోటను ముట్టడించినట్లు చెప్పి తండ్రికి సాయంగా పృథ్వీరాజును రమ్మని కోరతాడు. పృథ్వీరాజు వెళతాడు. **4వ రంగంలో** సురాజమల్లు,సారంగదేవులు గుడారంలో ఉన్నప్పుడు పృథ్వీరాజు ఒంటరిగా నిరాయుధుడై వాళ్ళ దగ్గరకు వెళ్లి పినతండ్రి క్షేమాన్ని గురించి తెలుసుకుని ఆ తర్వాత వాళ్లంతా కలసి ఒకే కంచంలో భోజనం చేస్తారు. పృథ్వీరాజు ధైర్య సాహసాలు ఇక్కడ వ్యక్తమౌతాయి. పగలంతా విరోధులుగా పరస్పరం ఒకరినొకరు చంపుకోవడానికి ప్రయత్నించి రాత్రి అయిన తరువాత ఒంటరిగా, నిరాయుధుడుగా శత్రువుపైన పినతండ్రి దగ్గరకు రావడం చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ పని పృథ్వీరాజు లాంటి అపూర్వ సాహసులు తప్ప ఎవరూ చేయలేరు.ఎటువంటి జంకూ గొంకూ లేకుండా వారితో కలసి భోజనం చేయడం మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. **5వ రంగంలో** సురాజమల్లు,సారంగదేవులు యుద్ధంలో ఓడిపోయి దట్టమైన అడవిలోకి పారిపోయి పృథ్వీరాజు రాక గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. అంతలోనే పృథ్వీరాజు అక్కడకు వెళ్లి పినతండ్రిని చంపబోవడం,అతడు ధైర్యంగా ఎదిరించి మాట్లాడటం,పృథ్వీరాజు అతన్ని చంపకుండా మేవారు నుంచి వెళ్లిపొమ్మని చెప్పడం మొదలైన విషయమంతా చరిత్రలో ఉన్నదే.

ఈ నాటకంలో చెప్పని, పృథ్వీరాజు చేసిన గొప్ప సాహసం ఒకటి చరిత్రలో ఉంది. తండ్రి పిలుపు మేరకు మేవారు వచ్చిన పృథ్వీరాజు మాళవ దేశపు ముస్లింరాజు మీదకు దండెత్తి వెళ్లినట్లుగా ఉంది. ముస్లింరాజు గొప్ప సైన్యంతో యుద్ధానికి బయలుదేరి ఓచోట విడిది చేసి వేశ్యల ఆటపాటలతో కోలాహలంగా ఉన్న సమయంలో పృథ్వీరాజు మెరుపుదాడి చేసి గుడారంలో ఉన్న రాజును బంధించి తీసుకునిపోతూ ఉండగా,హఠాత్పరిణామానికి నిశ్చేష్టులైన మాళవ సైన్యం తేరుకుని పృథ్వీరాజు వెంటబడతారు. తన సమీపానికి వస్తే మాళవ రాజును చంపివేస్తానని పృథ్వీరాజు బెదిరించడంతో వారు వెనుదిరిగి వెళ్ళిపోతారు.తరువాత పృథ్వీరాజు మాళవ రాజును తన తండ్రి కాళ్ళ మీద పడవేస్తాడు. రాణా రాయమల్లు అతన్ని తనతోటి రాజుగా గౌరవించి, కప్పం తీసుకుని విడిచిపెట్టినట్లుగా చరిత్రలో ఉంది. ఈ నాటకం అంతః కలహాల గురించి మాత్రమే ఉద్దేశించి రాసినట్లు ఉన్నది. అందువల్లనే ఈ చారిత్రకాంశాన్ని నాటకకర్తలు స్పృశించలేదు.

**పంచమాంకం:-**

పంచమాంకం **1వ రంగంలో** పృథ్వీరాజు తన అన్న సంగుడు జీవించి ఉన్నట్లుగా తెలుసుకుని అతన్ని చంపాలని ఆలోచిస్తున్న సమయంలో తన సోదరి శాంతాబాయి,తన భర్త జయమాలుడు హింసిస్తున్నాడని తనను కాపాడమని ఒక సేవకుని ద్వారా సందేశం పంపుతుంది. సంగుని విషయం పక్కనబెట్టి సోదరి కాపురం చక్కదిద్దడానికి ఆ రాజ్యానికి వెళ్లి,అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండా జయమాలుని గదిలో ప్రవేశించి చూడగా తన సోదరి భర్త శయ్య మీద, తన సోదరి కటిక నేలమీద పడుకొని ఉండడం చూసి కోపంతో జయమాలుని తన్ని కింద పడవేస్తాడు. తన భార్య శాంత తనను కింద పడవేసిందని భావించి జయమాలుడు ఆమెను కొడుతూ ఉంటాడు.పృథ్వీరాజు అతన్ని చంపబోతాడు.అప్పుడు సోదరి అడ్డుపడడంతో జయమాలుని తన సోదరి కాళ్లు పట్టుకుని,ఆమె చెప్పులు తలమీద పెట్టుకుంటే విడిచిపెడతాడు.ఇదంతా **2వ రంగం**, చరిత్రలో ఉన్నదే. అయితే పృథ్వీరాజు సోదరికి , ఆమె భర్తకు పేర్లు లేవు. నాటకంలో కల్పించారు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2021); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:10, ISSUE:3(1), March:2021
Online Copy Available: www.ijmer.in

**3వ రంగం** జయమాలుని అంతః పురంలో జరుగుతుంది. తనను అవమానించిన పృథ్వీరాజును అతను నిద్రపోతున్న సమయంలో కత్తితో నరికి చంపాలని ప్రయత్నిస్తాడు. అయితే పిరికితనంతో చంపలేకపోతాడు. వేరొక ఉపాయంతో చంపాలని నిర్ణయించుకుంటాడు.ఇదంతా చరిత్రలో ఉన్నదే.

**4వ రంగం** కమల్ మీర్ కోటకు దగ్గరలో ఉన్న మమ్మదేవి ఆలయం దగ్గర జరుగుతుంది. పృథ్వీరాజు తనకు చాలా బలహీనంగా ఉందని,జయమాలుడు తనపై విషప్రయోగం చేసినట్లు ఉన్నదని,తల తిరుగుతూ ఉన్నదని,మృత్యువు సమీపిస్తున్నదని గుర్రం దిగి అక్కడున్న ఒక బాలునితో అంటాడు. తాను ఇక కదలలేనని కమల్ మీర్ కోటకు వెళ్లి తారాబాయిని తీసుకుని రమ్మని పంపిస్తాడు. ఒక చెట్టుకు ఆనుకుని కూర్చొని చనిపోతూ రాజ్యకాంక్షతో తన అన్న సంగుని చంప ప్రయత్నించినందుకు పశ్చాత్తాప పడుతూ తనను క్షమించమని అతన్ని కోరుతూ,తనకోసం దుఃఖించవద్దని తండ్రిని ప్రార్థిస్తూ,భార్యకోసం కమల్ మీర్ కోట వైపు చూస్తూ చనిపోతాడు.నాటకం ముగుస్తుంది. **ఇది విషాదాంత నాటకం.**

**ఆధార గ్రంథాలు:-**

1. ఆంధ్ర నాటక సమీక్ష, శ్రీనివాస చక్రవర్తి, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ, 1963.

2. కోలాచలం శ్రీనివాసరావు నాటక సాహిత్య సమాలోచనము, డా: ఎస్.గంగప్ప, శ్రీ వరలక్ష్మి ప్రెస్, హైదరాబాదు.

3. తెలుగు నాటక వికాసము, డా:పి.ఎస్.ఆర్.అప్పారావు, శివాజీ ప్రెస్, సికింద్రాబాదు, 1967.

4. బ్రహ్మశ్రీ అభినవ పోతన మంగిపూడి వేంకట శర్మగారి జీవిత చరిత్ర, కోగంటి దుర్గామల్లికార్జునరావు, విఘ్నేశ్వర గ్రంథమాల, పామర్రు, కృష్ణా జిల్లా, 1948.

5. పృథ్వీ రాజు-తారాబాయి, మంగిపూడి వేంకట శర్మ, చింతామణి ముద్రాక్షరశాల, 1918.

6. సహకారవిజయము, మంగిపూడి వేంకట శర్మ, తూర్పు గోదావరి జిల్లా సహకార సమ్మేళనము వారిచే ప్రచురితము, ఆలమూరు, 1932.

7. రాజాస్థాన కథావళి,మొదటి భాగం ,చిలకమర్తి లక్ష్మీ నరసింహం,శ్రీ మనోరమా ముద్రాక్షర శాల, రాజమహేంద్రవరం,1917

8. రాజాస్థాన కథావళి,రెండవ భాగం,చిలకమర్తి లక్ష్మీ నరసింహం,కొండపల్లి వీర వెంకయ్య,శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,రాజమండ్రి,1938

9. Annals and Antiquities of Rajasthan OR The central and Western Rajput States of India, LIEUT.-CoL. JAMES TOD,(Late political Agent to the Western Rajput States),Humphrey Milford Oxford University Press, London Edinburgh Glasgow New York, Toronto Melbourne,Bombay,1920